ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 29 మార్చి, 2026 | పేజీలు :08


## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష అధికారులను ఆదేశించారు.శనివారం ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ధర్మారం మండల తహసిల్దార్ కార్యాలయం, కేజిబీవీ ను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సకాలంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి ఆన్ లైన్ దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కేజీబీవీ లో బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి మంచి విద్యా ప్రమాణాలు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. కేజిబీవీ రినోవేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులపై దాడి హేయమే.. కానీ రోగుల దోపిడీపై స్పందన ఏది?



### కలెక్టర్ గారూ.. సామాన్యుడి రోదన వినిపించడం లేదా..
### ఫీజుల వేటలో 'ధర్మం' తప్పినప్పుడు పాలకుల మౌనం ఎందుకు?

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఒక చిన్న పిల్లల వైద్యుడిపై జరిగిన భౌతిక దాడి సంఘటన ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.వైద్యుల రక్షణ కోసం ఐఎంఏ ప్రతినిధులు,రాజకీయ నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి నిరసన తెలపడం,గంటల వ్యవదిలోనే యంత్రాంగ స్పందించడం ఆహ్వానించదగ్గ పరిణామమే,అయితే,ఇదే సందర్భంలో సామాన్య ప్రజల నుండి ఒక బలమైన ప్రశ్న వినిపిస్తోంది.వైద్యులపై చేయి చేసుకుంటే వ్యవస్థలు ఇంత వేగంగా కదులుతున్నాయి కదా..మరి అదే వైద్యులు ఫీజుల పేరుతో సామాన్యుల జేబులు కత్తరిస్తున్నప్పుడు,అనవసర పరీక్షలతో రోగుల రక్తాన్ని పిండుతున్నప్పుడు,ఈపాలకులు,అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజలు నిలదీస్తున్నారు.

**ఫీజుల దారి తప్పినప్పుడు 'న్యాయం'ఎక్కడా..?**

వైద్యం అనేది ఒక పవిత్రమైన సేవ అని నమ్మే రోజులు పోయి,అది నేడు ఒక కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయింది.సాధారణ జ్వరం వచ్చినా వేల రూపాయల బిల్లులు వేయడం,ఇన్సూరెన్స్ లేదా రీయింబర్స్‌మెంట్ ఉందంటే చాలు బిల్లులను రెట్టింపు చేసి చూపించడం వంటి అక్రమాలు బహిరంగ రహస్యమే,సామాన్య రోగి ఆసుపత్రి గడప తొక్కినప్పటి నుండి డిశ్చార్జ్ అయ్యే వరకు అడుగడుగునా ఫీజుల వేటలో నలిగిపోతున్నాడు.ఇలాంటి సమయాల్లో ఏ ఒక్క అధికారి కూడా ఆసుపత్రులపై తనిఖీలు చేసిన దాఖలాలు లేవు,మరి వేద్యుడికి అన్యాయం జరిగినప్పుడు స్పందించే పాలకులు,రోగికి అన్యాయం జరిగినప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యవస్థల స్పందనలో పక్షపాతం ఎందుకు.?**

డాక్టర్ సంతోష్ రాజ్ పై దాడి జరిగిన వెంటనే 24 గంటల్లో నిందితులను పట్టుకుంటామని హామీ ఇచ్చిన పోలీసులు,ప్రజాప్రతినిధులు..సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ వైద్యులపై లేదా ఫీజుల దోపిడి చేసే ఆసుపత్రులపై ఎందుకు ఆటువంటి గడుపు విధించడం లేదు?వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినప్పుడు సంఘీభావం తెలిపే నాయకులు,పేద రోగి బిల్లు కటలేక ఆసుపత్రిలోనే బందీగా ఉన్నప్పుడు ఎందుకు స్పందించడం లేదు.?చట్టం అనేది కేవలంహోదా ఉన్న వారికి రక్షణ కవచంలా,సామాన్యుడికి మాత్రం చుట్టంలా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నమ్మకం పెరగాలంటే నిష్పక్షపాతంగా ఉండాలి..**

దాడులు ఏ రూపంలో ఉన్నా అవి ఖండించదగ్గవే,వైద్యుడిపై చేయి చేసుకోవడం ఎంత తప్పో,వైద్యం పేరుతో రోగిని,ఆర్థికంగా దెబ్బతీయడం కూడా అంతకంటే పెద్ద తప్పు,పాలకులు,అధికారులు కేవలం ఒక వర్గానికి మద్దతు పలకడం మానేసి,అటు వైద్యుల భద్రతను,ఇటు రోగుల ప్రయోజనాలను సమతుల్యం చేయాలి. ఆసుపత్రులలో జరుగుతున్న ఫీజుల దోపిడీపై, అక్రమ బిల్లులపై కూడా కఠినమైన నిబంధనలు అమలు చేసినప్పుడే సామాన్య ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం కలుగుతుంది. కేవలం ప్రభావశీలుల కోసం మాత్రమే పని చేసే వ్యవస్థలు ఉంటే ,అది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**కలెక్టర్..సామాన్యుడి రోదన వినిపించడం లేదా..?**

జిల్లాలో ఒక వైద్యుడిపై దాడి జరిగినప్పుడు నిమిషాల వ్యవధిలో స్పందించే అధికార యంత్రాంగం,అదే ఆసుపత్రులలో సమన్య రోగులు ఫీజులు దోపీడీకి గురవుతున్నప్పుడు ఎందుకు మౌనం వహిస్తోందని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వైద్యుల భద్రత ఎంత ముఖ్యమో,రోగుల ప్రాణాలకు,వారి బేబులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం,నిర్మల్ జిల్లా కలెక్టర్ వైద్యుడిపై జరిగిన దాడిని ఖండించడాన్ని ఎవరూ అప్పుబట్టరు,కానీ అదే సమయంలో ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమించి సామాన్యుల రక్తాన్ని పిండుతున్నప్పుడు,ఇన్సూరెన్స్ పేరుతో అక్రమ బిల్లులు వసూలు చేస్తున్నాప్పుడు అవే అధికారిక గొంతుకలు ఎందుకు మూగబోతున్నాయి?చట్టం పాలన కేవలం ప్రభావశీలురకే రక్షణ కవచంలా మారి,సామాన్య పౌరుడికి మాత్రం అందని ద్రాక్షలా మిగిలిపోతుందా? జిల్లా ఉన్నతాధికారిగా కలెక్టర్ ఏకపక్షంగా కాకుండా,వైద్యుల ఆగడాలపై కూడా అంతే కఠినంగా స్పందించి,సామాన్యులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

### డిఫాల్ట్ రైస్ మిల్లర్లు మూడు నెలలో
# బకాయిలు చెల్లించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బకాయిలు చెల్లించేందుకు మూడు నెలలు గడువు ప్రభుత్వం పొడగించిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2014–15 నుండి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023–24 వరకు (రబీ 202223 సీజన్‌కు సంబంధించిన బకాయిలు ఉన్న రైస్ మిల్లర్లు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం 90 రోజుల లోపు ఎఫ్.ఆర్.కే సన్న బియ్యం లేదా నగదు రూపంలో బకాయి పరిమాణానికి సమానమైన మొత్తాన్ని 125% తో పాటు 12% వడ్డీతో చెల్లించాలనే ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రభుత్వం విషయాన్ని పునఃపరిశీలించి బకాయిల వసూలును వేగవంతం చేయడం, అలాగే తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ ప్రయోజనాలను పరిరక్షించడం కోసం గతంలో ఇచ్చిన గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ మార్చి 25 న ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు FRK సన్న బియ్యం లేదా నగదు రూపంలో బకాయిలను గడువులోపు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ వెసులుబాటును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమ బకాయిలను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌కు గడువు లోపల చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# నిజామాబాద్ నగర అభివృద్ధే బడ్జెట్

### నగరపాలక సంస్థ 2026-27 సంవత్సరపు బడ్జెట్ ఆమోదం
### టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పడుదామని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తర్వాత నగర అభివృద్ధే మన ధ్యేయంగా ఉండాలన్నారు. శనివారం నిజామాబాద్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన బడ్జెట్ సమావేశాన్ని మేయర్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026–27 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్‌తోపాటు 2025–26 సవరించిన అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ప్రారంభ నిలువ రూ. 9471.33 లక్షలు, 2025–26 సవరణ అంచనా ఆదాయం రూ. 13717.11 లక్షలు కలుపుకుని మొత్తం రూ. 23188.44 లక్షలుగా పేర్కొన్నారు. 2026–27 సంవత్సరపు

తరువాయి 8లో



# కేంద్రమంత్రి బండి సంజయ్ నివాసంపై సోలార్ ఏర్పాటు

**ప్రజాపక్షం/జమ్మికుంట :** కార్తికేయ సోలార్ పవర్ ఇన్స్టలేషన్. కంపెనీ కరీంనగర్ జమ్మికుంట వారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన సొంత ఇంటి పై ఇన్స్టిలేషన్ చేసిన సోలార్ పవర్ పాయింట్ ను అధికారులతో కలసి పరిశీలించారు. రాష్ట్రంలోని వార్డు మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి తమ తమ ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కోటి ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమన్నారు. అందు కోసం రూ.75 వేల కోట్లకు పైగా నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ సోలార్ వ్యవస్థపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన నివాసంపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకున్నారు. టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్ తో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు.

## హోటల్లో కట్టెల పొయ్యి తో ఇక్కట్లు



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా హోటల్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సరైన సమయంలో సిలిండర్లు అందకపోవడంతో, ప్రత్యామ్నాయం లేక చాలా మంది హోటల్ యజమానులు తిరిగి కట్టెల పొయ్యిల వైపు మళ్లుతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న టోటల్ యజమాని గ్యాస్ సిలిండర్ కొరత ఉండడంతో చేసేదేమిలేక కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు.ఈ కట్టలపై పొయ్యి వంట చేయడం వల్ల పొగ, వేడి ఎక్కువగా ఉండి ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారు.అసలే మండే ఎండాకాలంమంటను నిరంతరం గమనిస్తూ ఉండటానికి అదనపు శ్రమ అవసరమవుతోంది. ఎంత కష్టమైనా సరే హోటల్ నడపంది. అద్దె ఇబ్బందులు నిర్వహికులకు జీతాలు ఇవ్వ లేని పరిస్థితి ఉండడంతో చేసేది ఏమి లేక హోటల్ యజమాని కిరణ్ ఇలా కట్టెల పొయ్యితో వంటలు చేయాల్సి వస్తుందని అని తెలిపారు.

## మద్యం మత్తులో బీరు సీసాలతో దాడి... ఇద్దరు అరెస్ట్

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలోని బెల్టు షాపులో గురువారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది.మద్యం మత్తులో ఉన్న అరె.రాజ్‌కుమార్, దయ్యాల రవికుమార్ కలిసి బీరు సీసాలతో మాదాసి రాజయ్యపై దాడి చేయగా, ఆయన తీవ్రంగా గాయపడ్డాడు.గాయపడిన రాజయ్యను వెంటనే మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ రవికుమార్ నింధితులను అదుపులోకి తీసుకున్నారు.తరువాత ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను కఠినంగా ఎదుర్కొంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి మోదీ ప్రభుత్వం చర్యలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు, నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. పోషణ అభియాన్ పథకం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించుటకు కరీంనగర్ నగరంలోని తీగలగుట్ట పల్లి అంగన్వాడీ కేంద్రంలో సాక్ష్యం అంగన్ వాడీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిడిపివో సబితతో కలిసి మంచి నీటీ ప్యూరీ ఫై, పోషణ వాటిక, బాల పేయింటింగ్, పిల్లల ఆట వస్తువులను ప్రారంభం చేశారు. అనంతరం చిన్నారులతో ముఖాముఖిగా అప్యాయంగా మాట్లాడారు. పిల్లల విద్యాభ్యాసం, ఆటపటలు, అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణిలుకు బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అంగన్వాడీ నిర్వహాకులను అడిగి తెలుసుకున్నారు. పాలు, గుడ్లు, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పిల్లల హాజరు శాతం, బరువు ఎత్తు నమోదు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి ఈ వయస్సు ఎంతో కీలకమన్నారు. అలాంటి బాధ్యతను తమ భుజాలపై వేసుకుని, ఒక తల్లిలా పిల్లలను సాకుతున్న అంగన్‌వాడీ సిబ్బంది సేవలు వెలకట్టలేమని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**ప్రజాపక్షం/గంగాధరః** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆద్వర్యంలో రెండవ దశ అరైవ్ లైవ్ రోడ్డు భ ద్రతా వారోత్సవాలలో భాగంగా శనివారం గంగాధర మండలం మధురానగర్‌లో లయన్స క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కరీంనగర్ సిపి గౌష్ ఆలం ప్రారంభించారు. గ్రామంలోని వీఏఎస్ గార్డెన్స్ వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో డ్రైవర్ల నుంచి విశేష స్పందన లభించింది. లారీ, కార్ తదిదర వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ సంధర్భంగా నిపుణలైన వైద్యులు డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణలో కంటి చూపులో కీలకమమని వైద్యులు , పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్, చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, రజిని, ఎంపిడివో దమ్మని రాము, తహసీల్దార్ అంబటి రజిత తదితరులున్నారు.



## వావిలాల గ్రామంలో మెగా వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లా కలెక్టరు జిల్లా వైద్యారోగ్య శాఖధికారి ఆదేశాల మేరకు జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో శనివారం మెగా స్పెషలిస్ట్స్ ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరంనకు ముఖ్య అతిథి గా వావిలాల గ్రామ సర్పంచ్ కొండా అర్జున్ హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండా అర్జున్ డాక్టర్ వరుణ హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ నుండి వచ్చిన ఆరు రకాల వైద్యుల సేవలు ఉపయోగించు కోవాలని వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు సూచించారు. ఎముకల, డెంటల్, కండ్ల, ప్రిడియాటిక్స్, గైనాకలజీ జనరల్ మెడిసిన్ లకు సంబందించిన ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులకు చూపించుకొని, పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు తెలియ చేశారు. ఆరోగ్య పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఎండ తీవ్రతలవల్ల ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు వడ దెబ్బకు గురయే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వేసవి కాలంలో తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరించాలని, తలకి టోపీ, రూమలు ధరించాలని, రోజుకి మూడు నుండి ఐదు లీటర్లల మంచి నీరు త్రాగాలని, ఎండలేని సమయంలో వ్యవసాయ, ఉపాధి హామీ పనులు చేసుకోవాలని, డి హైడ్రెషన్ కాకుండా ఉండేందుకు ఓఆర్‌యస్ ద్రావనాలను తీసుకోవాలని ప్రజలకు, గ్రామస్తులకు సూచించారు. ఈ మెగా వైద్య శిబిరంలో 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచిత మందులు పంపిణీ చేయగా, 37 మందికి ల్యాబ్ పరీక్షలు చేసి, వారి రక్త నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం టి హబ్ కి పంపించారు. ఈ కార్యక్రమంలో వావిలాల ఉపసర్పంచ్ సతీష్, హెల్త్ సూపర్ వైజర్స్ అరుణ, సదానందం, స్పెషలిస్ట్ డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఫార్మసిస్టు రాజశ్రీధర్ రావు, కవిత, హైమావతి, రజిత, సంధ్యారాణి, పంచాయతీ సెక్రటరీ రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ రాముడు పట్టాభిషేకం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం కార్యనిర్వాహణాధికారి కందల సుధాకర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శేషం వంశీధరచార్యుల పర్యవేక్షణలో పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల భాగంగా ఉదయం 11 గంటలకు కళ్యాణ మండపంలో ఉత్సవ మూర్తులను అర్చకులు పట్టు వస్త్రలతో సర్వాంగ సుందరంగా అలంకరించి శాస్త్రత్సంగా అట్టహాసంగా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. 108 సువర్ణ పుష్పాలతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకను చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రభుత్వోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి స్వామివారికి శేష వాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులకు సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖిల్లా ప్రాంతంతో తవ్వకాలపై కలెక్టర్ కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో ఈ మధ్య జరిగిన గుప్తనిధుల తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేసినట్లు టీజేఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మోరే గణేష్ తెలిపారు.చారిత్రాత్మకమైన ఖిల్లా ఆనవాలను ధ్వంసం చేస్తూ గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న ముఠాపై ఉన్నత శాఖ పోలీసు రెవెన్యూ శాఖ ,పురావస్తు శాఖ అధికారులు దృష్టి సారించి శాఖపరమైన చర్యలు తీసుకోని మొలంగూర్ ఖిల్లా చరిత్రను ఆనవాళ్లను కాపాడడానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

## మహిళా పోలీసు విశ్రాంతి గదుల నిర్మాణం ప్రారంభం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌టిపిసి సిఎస్సార్ నిధులు రూ.75 లక్షలతో చేపట్టున్న మహిళా విశ్రాంతి గదుల నిర్మాణానికి ఎన్‌టిపిసి ఈ.డి. చందన్ కుమార్ సమంతా, రామగుండం సి.పి. అంబర్ కిషోర్ ఝూ లు శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పోలీస్‌శాఖలో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి మెరుగైన వసతులు, భద్రత, గౌరవం, ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గాను మొత్తం ఆరు పోలీస్‌స్టేషన్లలో మహిళా విశ్రాంతి గదుల నిర్మాణాన్ని చేపట్టున్నట్లు ఈ.డి. తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో(హెచ్‌ఆర్) బిజోయ్ కుమార్ సికందర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, గోదావరిఖని టూటౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్‌రావు, ఎస్.ఐ.లు సిబ్బంది, సీఎస్సార్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పదో తరగతి గణితం పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (7495) మంది హాజరు కావాల్సి ఉండగా, (7486) మంది హాజరు కాగా,(9) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, 99.9 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## 99 రోజుల ప్రజాపాలనలో మెగా ఆరోగ్య శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, సాయి రామ్ నగర్ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మెగా ఆరోగ్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు.వైస్ చైర్మన్ ఓంకారి నవీన్. కౌన్సిలర్లు పందిరి రమేష్. గుడిగందుల అజయ్ పాల్గొని శిబిరంలో వైద్య సేవలు, పరీక్షల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్థానికులు అధికారులు కార్యక్రమం ద్వారా సంతృప్తి వ్యక్తం చేశారు.

# లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం : జడ్జి నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/మెట్‌పల్లి** : మెట్‌పల్లి మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని తెలిపారు. పరస్పర రాజీ ద్వారా సమయం, ఖర్చు ఆదా అవుతాయని చెప్పారు. బ్యాంకుల వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని బకాయిదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ కుమార్,




సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్య రాజారాం, అసిస్టెంట్ పబ్లిక్ క్లాసిక్యూటర్ జి ప్రణయ్, మెట్పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్,మెట్పల్లి సీఐ అనిల్ కుమార్, మెట్పల్లి పోలీస్ సర్కిల్ పరిధి ఎస్సైలు, మెట్పల్లి ఎస్సై, పబ్బా కిరణ్ కుమార్, మల్లాపూర్ ఎస్సై అనిల్ కుమార్. ,ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్, లోక్ అదాలత్ మెంబర్లు, వడ్డేపల్లి శ్రీనివాస్, జెడి సుధాకర్, మీడియేషన్ కోఆర్డినేటర్లు, ఓజ్జల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, సిబ్బంది, న్యాయవాదులు, అధికారులు, బ్యాంకు ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాలపై ‘పెద్దపల్లి’కి పురస్కారాలు!

**ప్రజాపక్షం/గోదావరిఖని** : స్త్రీనిధి రుణాల పంపిణి, రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను పెద్దపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారాలు లభించాయి. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన స్త్రీనిధి 13వ జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్క, సెర్ప్ సీఈవో అండ్ మెప్మా ఎం.డి. దివ్య దేవరాజన్‌ల నుండి పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీ పురస్కారం అందుకున్నారు. మున్సిపల్ పరిధిలో మెప్మా రుణాల పంపిణి, వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచినందుకు జిల్లా ప్రాజెక్టు డైరక్టర్, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఈ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ స్త్రీనిధి కార్యకలాపాలను విజయవంతంగా అమలు చేయడం పట్ల డి.ఆర్.డి.వొ. అధికారి ఎం.కాళిందిని పురస్కారం అందుకున్నారు. అదేవిధంగా విశేష ప్రతిభ కనబరిచిన అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి బి.రవీందర్, రీజినల్ మేనేజర్ ఆర్.దుర్గాప్రసాద్‌లకు పురస్కారాలను అందజేశారు.

## ‘ఖని’లో ఆగని కల్తీ... కల్తీ...!



*** వరుస తనిఖీలు, జరిమానాలు!!**

**ప్రజాపక్షం/గోదావరిఖని** : గోదావరిఖని పట్టణంలోని పలుచోట్ల రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాల్లో నాణ్యత లేని వస్తువులతో ఆహార పదార్థాలు తయారుచేస్తూ ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారు. ఇటీవల గోదావరిఖని పట్టణంలోని ఓ ప్రముఖ రెస్టారెంటులో జిల్లా ఆహార భద్రతాధికారులు తనిఖీ నిర్వహించి ఆహార పదార్థాల్లో బొద్దింకలను గుర్తించారు. తాజాగా శనివారం రామగుండం నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు లక్ష్మి నగర్‌లోని పలు షాపుల్లో తనిఖీలు చేపట్టారు. నాణ్యత లేని వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగిస్తున్న ఓ బేకరీ, మరో జ్యూస్ సెంటర్ నిర్వాహకులకు జరిమానాలు విధించారు. లీలా బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.5 వేలు, వైష్ణవి స్వీట్స్ అండ్ బేకరీకి రూ.3 వేలు, లిమ్రా ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌కు రూ.3 వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో రామగుండం నగరపాలక సంస్థ సానిటరి ఇన్స్‌పెక్టర్లు నాగభూషణం, సంపత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, జవాన్లు దయానంద్, అశోక్‌లు పాల్గొన్నారు.

## విద్యారంగానికి ఇచ్చిన హామీ అమలు చేయాలి

*ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్

**ప్రజాపక్షం/జగిత్యాల** : విద్యారంగానికి నిధులు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామిని తక్షణమే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8,500 కోట్ల స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయింపు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచినప్పటికి వాటికి సంబంధించిన బిల్లులు రెగ్యూలర్‌గా విడుదల చేయడం లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ చంద్, నాయకులు రాజేష్, రాకేష్, హరిహరణ్, బన్ని, శివ తదితరులు ఉన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది



కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ

**ప్రజాపక్షం/జగిత్యాల** : కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం సిఎం సహాయ నిధి చెక్కులను 24 మంది లబ్ధిదారులకు రమణ పంపిణీ చేసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాసన మండలి సమావేశాల్లో సంక్షేమ ఊసే లేదన్నారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నిత్యం ఢిల్లీ పర్యటనలకే పరిమితమవున్నారన్నారు. ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ వివిధ కార్యక్రమాల ద్వారా పోరాటాలు చేస్తుందని, వైఫల్యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లినా కనీస స్పందన లేదన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్‌పై గవర్నర్ ప్రసంగంలో ఊసే లేదన్నారు. ఆరు పంటకు ఇవ్వాల్సిన రైతు బంధు మూ డు పంటలకే ఇచ్చారన్నారు. రైతు వ్యతిరేఖిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన ఏదని సిఎంను ప్రశ్నించారు. బిఆర్ఎస్ 9 సంవత్సరాల పాలనలో 43 వేల కోట్లు అభివృద్ధికి వెచ్చించామని గుర్తు చేశారు. హామీల అమలు చేసే వరకు సర్కారుపై రోజుకో ఉద్యమం చేస్తామన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారడంపై రమణ స్పందించారు. సమయానికి అనుకూలంగా, పార్టీకి అనుగుణంగా ఎక్కడైతే గౌరవం లభిస్తుందో అక్కడ నాయకుడు ఉండడం సహజమన్నారు. ఉధ్యమ నేత కెసిఆర్ సలహాలు, సూచనలతో ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఐల్నేని సాగర్ రావు, హరిచరణ్ రావు, కోరుకంటి రాము, అవారిశివ కేసరి బాబు, హరీష్. ఐల్నేని వెంకటేశ్వర్ రావు, దయాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## పెద్దపల్లి జిల్లాస్థాయి ‘గౌడ ఆత్మీయ సన్మానం’ నేడు!

**ప్రజాపక్షం/గోదావరిఖని** : సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా కమిటి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జిల్లాలో ఇటీవల నూతనంగా గెలుపొందిన గౌడ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, జిల్లాలో పనిచేస్తున్న గౌడ పాత్రికేయులకు ఆదివారం ఉదయం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధి బాల సాని ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు గత వారం రో జులుగా జిల్లాలోని 14 మండలాల అన్ని గ్రామాల్లో, ప్రధాన పట్టణాల్లో ఆహ్వాన పత్రికలను పంపిణి చేసి అందరిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌడ కులస్తుల హక్కుల సాధనకు విశేషమైన కృషి చేసిన మల్యాల రామచంద్రం గౌడ్‌ను ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు తెలిపారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో పెద్దపల్లి జిల్లాలోని గౌడ కుల బంధువులందరిని ఒకేచోటకు చేర్చి ఐక్యతను బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివా రం ఉదయం జరిగే ఈ గౌడ ఆత్మీయ సన్మాన కా ర్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## గ్రామ పంచాయాతీ రికార్డులు పరిశీలన

**ప్రజాపక్షం/సారంగాపూర్** : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానంలో డిపివో మదన్ మోహన్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెంబట్ల కోనాపూర్ గ్రామ పంచాయతీలలోని రికార్డులను పరిశీలించి, డ్రైనేజి సోక్‌పిట్, నర్సరీలను, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, సారంగాపూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఆవరణలో డిపివో మదన్‌మోహన్ పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సలీమ్, సర్పంచులు కొలపాక రాధ రాజు, ఆకుల రమేష్, ఉప సర్పంచ్‌లు ప్రభాకర్, కిష్టయ్య, పంచాయితీ కార్యదర్శులు తిరుపతి, నరేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మెట్‌పల్లి కళాకారుల నృత్య ప్రదర్శన

**ప్రజాపక్షం/మెట్‌పల్లి** : శ్రీరామనవమి సందర్భంగా అరుణాచలం దేవస్థానంలో జాతీయ స్థాయి నృత్య ప్రదర్శన ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని అరుణాచలం దేవస్థానం సౌజన్యంతో నిర్వహించగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన నటరాజ నృత్య కళానిలయం ఆధ్వర్యంలో పచ్చిమట్ల భూపతి గౌడ్ నేతృత్వంలో పది మంది చిన్నారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు అందించారు.చిన్నారుల నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకుని, భక్తి వాతావరణాన్ని నెలకొల్పాయి.కార్యక్రమం ముగింపులో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను బంగారు పతకాలతో సన్మానించారు.అలాగే గురువు పచ్చిమట్ల భూపతి గౌడ్ ని కూడా బంగారు పతకంతో సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, భక్తులు చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

## రేపు అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/పెగడపల్లి** : మండల కేంద్రమైన పెగడపల్లిలో ఏప్రిల్ 14న నిర్వహించనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం (మార్చి 30) ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బాలే అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించడమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల అంబేద్కర్ సంఘం నాయకులు,బీసీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కమిటీ ఎన్నికకు సహకరించాలని కోరారు.ఈ ముందస్తు సన్నాహక సమావేశంలో మండల అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల ప్రదీప్, అంజయ్య, కొత్తూరు బాబు తదితరులు పాల్గొని వేడుకల విజయవంతానికి పలు సూచనలు చేశారు.

## వాట్సప్ చేయండి... సమస్య పరిష్కరిస్తా!

పైప్‌లైన్ లీకేజీ పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ మహంకాళిస్వామి



**ప్రజాపక్షం/గోదావరిఖని** : రామగుండం నగరపాలక సేవలకు సంబంధించి ఎక్కడ ఏ లోపం తలెత్తిన వెంటనే 9392483959 వాట్సప్ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుకు సంబంధించిన సమాచారం, ఫోటో కూడ పంపించాలని, తక్షణ సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని మేయర్ మహంకాళిస్వామి తెలిపారు. శనివారం గోదావరిఖని శారదానగర్ పి.జి. కళాశాల ఎదుట తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తు పనులను మేయర్ అక్కడే కూర్చొని పర్యవేక్షించారు. ప్రశాంత్‌నగర్ నుంచి పవర్‌హౌజ్‌కాలనీ వరకు 4 డివిజన్లకు నీటి సరఫరా అంతరాయం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. నీటి పొదుపు, కనెక్షన్‌కు వాల్వ్ అమరిక ద్వారా ప్రతిఒక్కరూ వేసవి కాలంలో నీరు వృధా కాకుండా చూడాలని మేయర్ కోరారు.

## మంచాల పొచన్నకు ఘన నివాళి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్‌రూరల్:** ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంటా గ్రామానికి చెందిన సీనీయర్ రాజకీయ నాయకులు, నాలుగు పర్యాయాలు సహకార బ్యాంక్ సోసైటీ చైర్మన్‌గా సేవలందించిన మంచాల పొచన్న(72) అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మంచాల పోచన్న నివాసానికి చేరుకుని, పొతన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి సొమన్న, మంచాల మల్లయ్య, డ్రీం స్వచ్చంద సంస్థ డైరెక్టర్ పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌పై వివక్ష వీడాలి

### అన్నేల లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/సిరికొండ:** ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న వివక్షను ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మ ణ్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఇచ్చోడలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి పార్లమెంట్‌లో చెప్పడం విస్మయం కలిగంచిందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఏళ్లుగా చెబుతున్న మాటలు వట్టివేనని ఈ ఘటనతో తేలిపోయిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ నుంచి నేటి కాంగ్రెస్, బీజేపీ వరకు పాలకులు తమ సొంత జిల్లాల అభివృద్ధిపైనే శ్రద్ధ చూపుతూ, వెనుకబడిన ఆదిలాబాద్‌ను విస్మరించారని ఆరోపించారు. తక్షణమే ఆదిలాబాద్‌ఆర్మూర్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్ట్ పనులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించాలని కోరారు.

## ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన ఏలే

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలకేంద్రంలో నూతనంగా లబ్దిదారు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని వారిచే డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్ రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్బంగా లబ్దిదారుతో పాటు పలువురు గ్రామస్థులు డీసీసీ చైర్మెన్‌ను శాలువాతో సన్మానించారు. పాల్గొన్న స్థానిక నాయకులకు, ప్రజాప్రతినిదులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మద్నూర్ ఉపసర్పంచు రమేష్ నివాసానికి వెళ్ళిన డీసీసీ చైర్మెన్ మల్లికార్జున్‌ను వారి కుటుంబీకులు శాలువాతో సన్మానించారు.

## అచ్చంపేట్‌లో కుస్తీ పోటీలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీల్లో పిట్లం, నారాయణఖేడ్, బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాలే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి మల్లయోధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలపడ్డారు. విజేతలకు రూ 50 నుండి 4000ల రూపాయల వరకు నగదు బహుమతులు అందజేశారు. నాయకులు అంజయ్య, ప్రవీణ్, ఎల్లయ్య, ప్రసాద్, సాయిలు, సాయిరాం పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

### మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్:** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య, వాటర్ సప్లై విభాగాల సిబ్బంది హాజరు కట్టికలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల వేతనాల కోసం ప్రతి నెలా రూ 78 లక్షలు చెల్లిస్తున్నామని తెలిపారు. కొందరు కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందని, సిబ్బంది ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని సూచించారు. గతంలో పర్యవేక్షణ లోపం వల్ల కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఇకపై అటువంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు తాగునీటిని వృధా చేయకుండా మితంగా వాడుకోవాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నల్లాలకు ట్యాప్‌లు బిగించుకోవాలని కోరారు. కార్మికుల జీతాలు, పీఎఫ్ నిధులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కార్మికులకు అవసరమైన సబ్బులు, నూనెలు, గ్లౌజులు, ఆప్రాన్లను కౌన్సిల్ తీర్మాణం ద్వారా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

## యంగ్ ఇండియా స్కూల్ పనులు పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గకేంద్రంలోని మద్నూర్ మండలకేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం పరిశీలించారు. కలెక్టర్‌కు డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ ఆత్మీయంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల నిర్మాణానికి సంబందించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించి పనులను అత్యుత్తమ నాణ్యతతో వేగంగా పూర్తిచేసి త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ చూపుతున్న చొరవ హర్షనీయమని ఏలే మల్లికార్జున్ కొనియాడారు.

## ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని గ్రామదేవతలైన అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గ్రామాన్ని, ప్రజలను చల్లంగ చూడుమంటూ అమ్మవార్లను వేడుకున్నారు. ముదిరాజ్ సంఘం పెద్దలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీంధర్‌రెడ్డి, నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, సర్పంచు కుమ్మరి రాములు, ఉపసర్పంచ్ శంకర్, గ్రామయువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నస్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం

### మంచిర్యాల పురపాలక మేయర్ ధరణి మధుకర్

**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా స్థాయి నిపుణులైన వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంచిర్యాల పురపాలక మేయర్ ధరణి మధుకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ మాతా శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. వైద్య కేంద్రాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ ఎస్ అనిత మాట్లాడుతూ 99 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా 72 రకాల పరీక్షలు, క్యాన్సర్ నిరోధక వ్యాక్సినేషన్, మహిళా సంఘాలకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎనిమిది ఆర్ బిఎస్ కె బృందాల ద్వారా ఇప్పటి వరకు 12 వేల మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, కౌన్సిలర్లు గోపాలరావు, ఖలీద్, హరికృష్ణ, జిల్లా ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెంకటేష్, సిహెచ్ఓ కాకిరాల వెంకటేశ్వర్లు, డిపిఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## 31న గ్రామ పంచాయతీ దుకాణ సముదాయాల వేలం



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణ సముదాయాలకు మార్చి 31న వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ వేలం ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. పంచాయతీ ఆదాయ వనరులను పారదర్శకంగా కేటాయించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా లక్ష రూపాయల డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఏప్రిల్ 1, 2026 నుండి మార్చి 31, 2028 వరకు రెండు సంవత్సరాల కాలపరిమితి వర్తిస్తుందని వివరించారు. నిబంధనల ప్రకారం పన్నులు, ఇతర చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని, గెలుపొందిన వారు గడువులోగా సొమ్ము చెల్లించకపోతే డిపాజిట్ రద్దు చేస్తామని హెచ్చరించారు. గ్రామ అభివృద్ధికి ఆదాయ వనరులను పెంపొందించడమే లక్ష్యంగా ఈ వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## కొలం గిరిజనుల ఇందిరమ్మ ఇళ్లు ఏవి?



**ప్రజాపక్షం/ ఉట్నూర్:** కొలం గిరిజనులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఏవని ముఖ్యమంత్రి రేవంత్ రేడ్డిని లంబాడాల హక్కుల పోరాల సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చవాన్ ప్రశ్నించారు. శనివారం ఆయన ఉట్నూర్ మండలంలోని దొంగచింత, కుమ్మరి కుంట కోలాంగూడ గ్రామాలను సందర్శించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందన్న సంతోషంతో గిరిజనులు ఉన్న ఇళ్లను కూల్చుకుని, గుడిసెల్లో ఉంటూ పునాదులు తవ్వుకున్నారని తెలిపారు. అయితే అటవీ అధికారుల అభ్యంతరాల వల్ల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇచ్చి, గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోలాం సంఘం నాయకులు వసంతరావు, ఆత్రం ముకుందరావు, కొడప రాజు, మడవి రమేష్, రాజు పటేల్, గంగారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి కుప్పకూలిన జొన్న పంట


### ఆదుకోవాలని రైతుల వేడుకోలు



**ప్రజాపక్షం/తలమడుగు:** తలమడుగు మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు మొక్క జొన్న, జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షం, ఈదురు గాలుల ధాటికి పంటలు నేలపాలవ్వడంతో తలమడుగు, రుయ్యాడి గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేవారు. ముఖ్యంగా కౌలుకు భూమిని తీసుకుని సాగు చేసిన రైతు కృష్ణ చేతికి వచ్చే సమయంలో పంట ఇలా నాశనం కావడంతో కన్నీరుమున్నీరయ్యారు. నేలపాలైన మొక్కజొన్న కంకులను పైకి లేపుతూ రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని కోరారు. నష్టపోయిన తమకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

## మొబైల్ ఫోన్ పొగొట్టుకుంటే వెంటనే పోలీసులను సంప్రదించాలి

### ఎస్‌పి అఖిల్ మహజన్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్:** మొబైల్ ఫోన్లు పొగొట్టుకున్న బాధితులు వెంటనే ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జిఓవి.ఐఎన్‌లో పిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ సూచించారు. శనివారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పొగొట్టుకున్న 105 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ దొంగల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. మొబైల్ ఫోన్ల విక్రయదారులు, రిపేరింగ్ షాపుల యజమానులు ఫోన్లను కొనుగోలు చేసేటప్పుడు సరైన పత్రాలను తనిఖీ చేయాలని హెచ్చరించారు. దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## జాన్కంపేట్‌లో సామూహిక శ్రీరామ సంకీర్తన

**ప్రజాపక్షం/ఎడపల్లిః** సనాతన సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా మార్చి 26నుంచి ఏప్రిల్ 2వరకు దేశ వ్యాప్తంగా సామూహిక శ్రీ రామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది. అందులో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో శ్రీ రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని స్థానికులు అందరూ కలిసి భక్తిభావంతో జరుపుకున్నారు. హిందువులందరం మా సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు దేవాలయాలను రక్షించుకుంటామని, అలాగే రామరాజ్య స్థాపన జరగాలని శ్రీ రాముడికి ప్రార్థన చేసి ప్రతిజ్ఞ చేపట్టారు.

## ప్రహరీ గోడ నిర్మాణానికి శుంకుస్థాపన



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని కోలూర్ గ్రామంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.15 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి శనివారం గ్రామ సర్పంచ్ బోడ్కే మాధవరావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,కారో బారి నర్సారెడ్డి,నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోల్సా నండి కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/తానూర్ః** మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు కొండగట్టుకు పాదయత్రగా శనివారం బయలుదేరారు.గ్రామానికి చెందిన దిగాంబ్,లక్ష్మ ణ్,యేగేష్,శివకుమార్,గంగాధర్,భక్తిశ్రద్ధలతో అంజనేయ స్వామిని దర్శించుకునేందుకు ఈ యాత్ర చేపట్టారు.స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తుల వీడ్కోలు మధ్య వారు తమ ప్రయాణాన్ని ప్రారంభించారు.

## అక్రమ ఇసుకకు వేలం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** అక్రమంగా నిలువ చేసిన ఇసుకకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ సంధ్యారాణి తెలిపారు.సారంగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను శుక్రవారం జప్తు చేయడం జరిగిందని.దీంతో కలెక్టర్ అదేశానుసారం మంగళవారం రోజు బహిరంగ వేలం నిర్వహించబడును అని పేర్కొన్నారు.40 నుండి 50 ట్రాక్టర్ల ఇసుక దాదాపు 150 క్యూబిక్ మీటర్లు ఉంటుందని ఈ వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావస్తు సొమ్ము 5000 రూపాయలు చెల్లించాలని,ఒక్కోట్రక్టర్ ఇసుకకు 1800 రూపాయలు తగ్గకుండా ప్రభుత్వం ధర నిర్ణయించడం జరిగిందన్నారు.

# మితిమీరిన వేగంతోనే రోడ్డు ప్రమాదాలు

### మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్



**ప్రజాపక్షం / నస్పూర్ :** మితిమీరిన వేగం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ తెలిపారు. శనివారం నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో మంచిర్యాల రూరల్ సిఐ గోపతి రవీందర్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' ఫేజ్03 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బాధ్యతాయుతంగా వాహనాలు నడిపినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వేగ పరిమితి పాటించాలని సూచించారు. సీటు బెల్టు ధరించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లు వాడకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది, మంచిర్యాల జిల్లాలో 152 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి 'రాహవీర్' పథకం ద్వారా 25,000 రూపాయల నగదు ప్రోత్సాహకం అందిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సురక్ష కంటి వైద్యశాల ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సిఐ గోపతి రవీందర్, సిసిసి నస్పూర్ ఎస్ఐ మేకల ప్రశాంత్, డాక్టర్ అభిషేక్, నస్పూర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం, మంచిర్యాల లారీ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలు కార్మికుల హక్కు



**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలు కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే సౌలభ్యం కాదని, అది వారి హక్కు అని ఎఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై అసెంబ్లీలో ఉప ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భూగర్భ గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు వారి కుటుంబాలకు భరోసా కల్పించే ఈ వ్యవస్థను ఆర్థిక భారంగా చూపడం సరికాదన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నిబంధనల ప్రకారమే జరుగుతుందని, అక్రమాలు ఉంటే నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. విచారణల పేరుతో కార్మికులను భయపెట్టే ప్రయత్నం చేస్తే ఎఐటియుసి ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక ప్రకటనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిని లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికుల పట్ల సానుకూల వైఖరి అవలంబించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. బీమనాథుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, నాయకులు తిరుపతి, పెద్దపెల్లి బానయ్య, ఈ రాజేశ్వరరావు, సివి రమణ, గాండ్ల సంపత్, మర్రి కుమారస్వామి, కల్వల శ్రీనివాస్, పారిపెల్లి సంజీవ్ కుమార్, జి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ



**ప్రజాపక్షం / తిర్యాని :** ఉపాధి హామీ కూలీల సంక్షేమం కోసం మందగూడ గ్రామపంచాయతీలో మెడికల్ కిట్లు, వాటర్ డబ్బాలను పంపిణీ చేశారు. శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని మందగూడలో సర్పంచ్ తుంరం గోపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండలో పనిచేసే కూలీలకు తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోకుండా ముందస్తు జాగ్రత్తగా కిట్లను అందిస్తున్నామని తెలిపారు. పని సమయంలో తగినంత నీరు తాగుతూ, విరామం తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉపాధి పనులు ఆటంకం లేకుండా సాగేందుకు పంచాయతీ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి సురేష్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ గౌడ్, వార్డు సభ్యులు, మేట్ కిషన్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ స్వాముల మండల దీక్ష

**ప్రజాపక్షం/ఎడపల్లిః** ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో హనుమాన్ స్వాముల మండల దీక్షను హనుమాన్ దీక్షా పరులు శోభాయమానంగా నిర్వహించారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో నిర్వహించిన హనుమాన్ స్వాముల మండల దీక్షకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు. ఈ మేరకు హనుమాన్ స్వాములు అతి పెద్ద శ్రీరాముని, ఆంజనేయ స్వామి విగ్రహాలకి పూలమాలలతో అలంకరించిన రథంపై స్వామి వారిని గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి ప్రధాన వీధుల గుండా భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. శ్రీ రామ, ఆంజనేయ స్వామి రథం ముందు దీక్షాపరులు ఆనంద పారవశ్యంతో నృత్యాలు చేస్తూ భక్తి పాటలు పాడుతూ స్వామి వారి శోభాయాత్రను కొనసాగించారు. మహిళలు హారాతులతో వారికి స్వాగతాలు పలుకుతూ హనుమాన్ దీక్షాపరులు పాదయాత్ర చేస్తున్న రహదారిపై బిందెలతో నీళ్లను చల్లుతూ భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

## సారంగాపూర్ హనుమాన్ దేవాలయం వరకు పాదయాత్ర

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అఖిల భారత హనుమాన్ దీక్షా సేవా సమితి ఇందూరు విభాగం ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ దేవాలయం వినాయక్‌నగర్ నుంచి సారంగాపూర్ హనుమాన్ దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. హనుమాన్ స్వాములు పాదయాత్రలో హనుమాన్ చాలీసా పారాయణం భజన కార్యక్రమం హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సంతోష్, శ్రీకాంత్ స్వామి, బుస్సాపూర్ శంకర్, ఇందల్వాయి కిషన్, రఘు కులాచిరి, రోహిత్ స్వామి, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



## వీర హనుమాన్ శోభాయాత్రకు సహకరించాలి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహణకు అవసరమైన అనుమతులు, పోలీస్ సహకారం అందించాలని హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు కాగజ్ నగర్ డిఎస్‌పి వహీదుద్దీన్‌ను శనివారం కోరారు. ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించనున్న శోభాయాత్ర వివరాలను తెలియజేశారు. కార్యక్రమాన్ని శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించాలని వారు విన్నవించారు. అనంతరం టౌన్ సిఐ ప్రేమ్ కుమార్‌ను కలిసి శోభాయాత్రకు అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, ఇతర అనుమతుల కోసం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు పాల్గొన్నారు.

## కాస్మోటాలజీ శిక్షణ పూర్తి 31 మందికి సర్టిఫికెట్ల ప్రదానం

**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి సంస్థ సిఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్మోటాలజీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న 31 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శనివారం మందమర్రి ఏరియాలోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆయన పిలుపునిచ్చారు. శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ సూచించారు. సింగరేణి సంస్థ సిఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు యువతకు ఎంతో ఉపయోగకరమని ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, జిఎంవిటిసి అడిషనల్ మేనేజర్ టి శ్రీధర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్ కుమార్, ట్రైనర్ ప్రీతి, ఇన్స్ట్రక్టర్ డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టీకాలతోనే గాలికుంటు వ్యాధి నివారణ

**ప్రజాపక్షం / కాసిపేట :** పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కాసిపేట మండలం దేవాపూర్ సర్పంచ్ సిడాం రాందాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీకాలు వేయించడం ద్వారానే ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని 650 పశువులకు టీకాలు వేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సరిత, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## జర్నలిజం మౌలికాంశాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** జర్నలిజంలోని మౌలికాంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళికృష్ణ సూచించారు. శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జర్నలిజం, మౌలికాంశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్త నిర్మాణం, వార్తలు రాసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత కాలంలో జర్నలిజం కోర్సును ఒక మంచి కెరీర్ అవకాశంగా ఎంచుకోవచ్చని ఆయన తెలిపారు. ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థులకు అదనపు ప్రయోజనం కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీదేవి పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత జర్నలిజం కోర్సులు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉత్తమ అవకాశాలు అందుకోవచ్చని తెలుగు విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి నరసింహం వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డి జనార్ధన్, అధ్యాపకులు జె మహేష్, శాంభవి, సానియా, విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయిలో మెరిసిన నిర్మల్ పోలీస్ అక్క..

## ఢిల్లీలో ప్రతిష్ఠాత్మక 'స్కాచ్' అవార్డు అందుకున్న ఎస్పి జానకీ షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ :** మహిళలు,విద్యార్థినుల భద్రత కోసం నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమం "పోలీసు అక్క" జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది.సామాజిక మార్పుకు నాంది పలికే అత్యుత్తమ ప్రాజెక్టులకు అందించే ప్రతిష్ఠాత్మక స్కాచ్ అవార్డుకు ఈ కార్యక్రమం ఎంపికైంది శనివారం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్వయంగా హాజరై ఈ గౌరవాన్ని అందుకున్నారు.ఒక చిన్న ఆలోచనగా ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ జిల్లా కీర్తి కిరీటంలో మరో మైలురాయిగా నిలిచింది.

### భరోసా కల్పిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్ మోడల్..

నేటి సమాజంలో మహిళలు,బాలికల రక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం కావడంతో వారిలో భయం పోగొట్టి ధైర్యాన్ని నింపేందుకు ఎస్పీ డా.జానకి షర్మిల ఈ పోలీస్ అక్క విధానాన్ని రూపొందించారు.ఇది కేవలం నేరాలను అదుపు చేయడమే కాకుండా,బాధితులకు ఒక కుటుంబ సభ్యురాలిలా అండగా నిలిచే సమగ్ర కమ్యూనిటీ పోలీసింగ్ మోడల్‌గా రూపుదిద్దుకుంది.జిల్లాలోని మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ అక్కలుగా మారి,క్షేత్రస్థాయిలో బాధితులకు చేరువవుతున్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు,పోలీసులు తమకు ఆప్తమిత్రులనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం విజయవంతంగా కలిగించింది.

### విద్యార్థినుల చెంతకు రాత్రి బస సేవలు..

ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఆకర్షణ కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించే రాత్రి బస కార్యక్రమం ప్రతి నెల మహిళా పోలీస్ అధికారులు విద్యార్థినులతో కలిసి ఒక రాత్రి గడుపుతూ..వారి సమస్యలను ఓపిగ్గా వింటున్నారు.ఈ క్రమంలో బాలికలకు గుడ్ టచ్‌బాడ్ టచ్ పై అవగాహన కల్పించడంతో పాటు,సైబర్ నేరాలు, పోక్సో చట్టం,బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.ఇప్పటివరకు సుమారు 7000 మందికి పైగా విద్యార్థినులు,మహిళలు ఈ సేవల ద్వారా ప్రత్యక్షంగా ప్రయోజనం పొందారు.విద్యార్థినులు సంకోచం లేకుండా తమ సమస్యలను నేరుగా పోలీస్‌అక్కలకు చెప్పుకోవడం వల్ల వేధింపులను ప్రాథమిక దశలోనే అడ్డుకునే అవకాశం ఏర్పడుతోంది.



### బాధ్యతను పెంచిన జాతీయ గుర్తింపు..

స్కాచ్ అవార్డు అందుకున్న అనంతరం ఎస్పీ డా.జానకి షర్మిల మాట్లాడుతూ ఈ విజయం తనతో పాటు పనిచేసిన ప్రతి మహిళా పోలీస్ సిబ్బందిది.నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు కేవలం చట్టాన్ని అమలు చేసే యంత్రాంగంగానే కాకుండా,సమాజానికి మార్గదర్శకులుగ నిలవడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.ఈ జాతీయ స్థాయి గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని,భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించి ప్రతి బాలికకు రక్షణ కవచంలా నిలుస్తామని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రారంభమైన ఈ ప్రయోగం నేడు జాతీయ వేదికపై ప్రశంసలు అందుకోవడం తెలంగాణ పోలీస్ శాఖకే గర్వకారణమని ఆమె పేర్కొన్నారు.

# నేడు స్వయం సహాయక సంఘ సభ్యులకు పరీక్షలు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మండలంలోని సీసీలకు,వివోఏ లకు ఎగ్జామ్ నిర్వహణ పై ఒరెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.దానితోపాటు వారికి సంబంధించిన ఎగ్జామ్ పేపర్లు,అవార్డు లిస్టు,రిజిస్ట్రేషన్ ఫామ్స్,పెన్నులు తదితర వస్తువులు అందించడం జరిగింది.ఉల్లాస్ అమ్మకు అక్షరామాల లో భాగంగా 1572 మంది స్వయం సహాయ సంఘ సభ్యులను గత సంవత్సరం రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.ఆదివారం రోజున అన్ని గ్రామాలలోని గవర్నమెంట్ స్కూల్లో ఎగ్జామ్ నిర్వహించడం జరుగుతుంది కావున 865 మంది స్వయం సహాయక సంఘ సభ్యుల హాజరై పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సదానందం,ఏపీఎం బోసు,సీసీలు సాయన్న పోశెట్టి,ముత్యం కార్యాలయ సిబ్బంది గంగాధర్,మహేష్,సుధాకర్ వివిధ గ్రామాల మొక్క వివోఏలు పాల్గొనడం జరిగింది.

# బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాండ్ గెస్ట్ లెక్చర్



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది.తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విలువైన మార్గదర్శనం అందించారు.ఇండస్ట్రియల్ లోన్స్ తీసుకునే విధానం,వ్యాపార అభివృద్ధికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక,రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి కీలక అంశాలపై ఆయన సమగ్రంగా వివరిస్తూ విద్యార్థుల్లో వ్యాపార అవగాహన పెంపొందించారు. ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సహీదా తబస్సుం,ఆధ్వర్యంలో జరిగింది.ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య ,అధ్యాపకులు కలిసి అతిథిని ఘనంగా సన్మానించారు.విద్యార్థులు తమ సందేహాలను అడిగి స్పష్టమైన సమాధానాలు పొందారు.


# జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామానికి చెందిన సల్ల శంకర్ స్వర్ణలత కుమారుడు శ్రీథన్ జన్మదిన వేడుకలు శనివారం జరిపించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, సర్పంచ్ రాజయ్య పాల్గొని ఆశీర్వదించారు. గ్రామ ఉపసర్పంచ్ కలవెన స మ్మక్క చేరాలు,వార్డు సభ్యులు దొడ్డ కమల కిషన్,కందునూరి ప్రశాంత్ తో పాటు నాయకులు దొడ్డ సంపత్,సల్ల కిష్టయ్య, చంద చంద్రమౌళి,దొడ్డ శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కల్వచర్ల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించాలి

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ప్రజాపక్షం/ ముధోల్ :** మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించాలనే ధ్యేయంతో ప్రభుత్వాలు మహిళలకు ప్రతి రంగంలో ప్రాధాన్యతనిస్తున్నాయని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.శనివారం మండలంలోని విట్టోలి గ్రామంలో మహిళ సంఘ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు.మహిళలు అభివృద్ధి చెందితేనే దేశ అభివృద్ధి చెందాలని సూచించారు.మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభవృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.ఈ



కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్,గ్రామ సర్పంచ్ సుచరిత దిగంబర్,ఉప సర్పంచ్ శివాజీ పటేల్,పంచాయతీ కార్యదర్శి అనూష,ఎపిఎం గురుచరణ్,ఈజిఎస్ ఏపీఓ శిరీష,మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఉపాధ్యక్షులు

**ప్రజాపక్షం/ముత్తారం :** మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లినేని బుచ్చంరావు, కేడీసీసీ మాజీ డైరెక్టర్ రాంపల్లి గోపాల్ రావు అత్తమ్మ మొగుళ్ళపల్లి గ్రామానికి చెందిన పడిదెల సమ్మక్క అనారోగ్యంతో ఇటీవలే మరణించగా శనివారం మృతురాలి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం పరామర్శించారు.జిల్లా ఉపాధ్యక్షుడు వెంట కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు గాదం శ్రీనివాస్,ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు కోల విజయ్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపాముల శంకర్, కె.వి చారి,గుడి కొండాల్ రెడ్డి,పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో ఉత్సాహంగా క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు శనివారం స్థానిక ఎన్.టీ.ఆర్ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ ఎంపిక ప్రక్రియలో జిల్లాలోని వివిధ మండలాల నుండి సుమారు 60 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి,వారికి సరైన వేదికను కల్పించడమే లక్ష్యంగా ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా క్రీడా అధికారులు మాట్లాడుతూ,యువతలో చిన్న తనం నుండే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం,వారిలోని నైపుణ్యానికి పదును పెట్టడం ద్వారా భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను క్రీడా పాఠశాలల ప్రవేశానికి ఎంపిక చేయడం జరిగిందని వారు వివరించారు.ఈ కార్యక్ర



మంలో జిల్లా యువజన,క్రీడల శాఖ అధికారి(డీవైఎస్ఓ) శ్రీకాంత్ రెడ్డి,ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్,పీడీ రమణారావ్,పీఈటీ భోజన్న తో పాటు వివిధ మండలాల పీడీలు లక్ష్మణ్,సత్యయ్య,ఎం.సత్యనారాయణ,కె.శ్రీనివాస్,ఆర్.వెన్నెల,శారదా,సంజు రాథోడ్,కవిత,వంశీధర్,నచ్చేందర్,దేవేందర్ తదితరులు పాల్గొని ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

# పోలీసులమని చెప్పి అక్రమంగా డబ్బు వసూలు

## ...ఒకరి అరెస్ట్..




**ప్రజాపక్షం/తానూర్ :** ప్రజలను,బెదిరించడం,అక్రమంగా డబ్బులు వసూలు చేయడం,వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని,తానూర్ ఎస్సై షేక్ జుబేర్ హెచ్చరించారు.ఇటీవల మండలంలోని బోల్సా సమీపంలో బైంసా పట్టణం,నుండి కోలూర్ గ్రామానికి వెళ్తున్న గంగాధర్ పార్శ్వతోల్ల,అనే వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు రాత్రి వేళలో అడ్డుకున్నారు.తాము పోలీసులమని నమ్మించి,అతని వద్ద నండి డబ్బులు వసూలు చేశారు.ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు,తానూర్ మండల కేంద్రానికి చెందిన పున్నోల్లా ప్రకాష్ ను నిందితుడిగా గుర్తించి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడని,అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై జుబేర్ తెలిపారు.

# విద్యార్థులకు అభినందనలు

**ప్రజాపక్షం/ముత్తారం :** ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల లో ఖమ్మంపల్లి గ్రామంలోని శార్వాణి విద్యానికేతన్ లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల ను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ దయాకపు శ్రీనివాస్ అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. అదే విధంగా పలువురు విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులులను సైతం సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్క రాజేశ్వరి రాజయ్య, ఉప సర్పంచ్ సతీష్,వార్డ్ సభ్యులు,పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సిఎంకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైతు భరోసా నిధులు రావడంతో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద రావు పటేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫారూఖ్ అహ్మద్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రైతు భరోసా నిధులు పడడంతో సంబరాలు చేసుకోవడం జరిగింది.ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు బైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంబరాలు చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ తో పాటు మార్కెట్ డైరెక్టర్ భూమన్న,సిరల సర్పంచ్ మోహనరావు పటేల్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల దేవదాస్,నగ్గం దిగంబర్,ఫారుక్ హైమదవ,సేవాదళ్ బ్లాక్ అధ్యక్షుడు కదం ఆత్మరామ్,కదం వెంకట్ రావు,బాసర మండల అధ్యక్షుడు బండోళ్ల అనిల్ బైంసా మండల అధ్యక్షుడు అల్లం పోశెట్టి సేవాదళ్ కార్యదర్శి,అబ్దుల్ అజార్,రైతు మహిళలు పాల్గొన్నారు.



# నిజామాబాద్ నగర అభివృద్ధే బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ. 14763.60 లక్షలుగా బడ్జెట్‌లో పొందుపర్చారు. ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ. 9937.00 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. అదేవిధంగా మొత్తం అంచనా వ్యయం రూ. 24700.60 లక్షలుగా బడ్జెట్‌లో పద్దులో పేర్కొన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ వివరాలను సమావేశంలో చదివి వినిపించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కూరగాయల ఉమారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వము, ప్రజాపాలనలో భాగంగా ప్రజా అవసరాలకు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా తమ తమ డివిజన్లలో నెలకొన్నసమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం అని, నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా అందరం పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ సూచించారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా నిజామాబాద్‌లో మాస్టర్ ప్లాన్ అమలు అనివార్యంగా మారిందన్నారు. ఇప్పటికే ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరిగిందని, ఎవరికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు ముసాయిదా ప్లాన్‌లో ఏవైనా సవరణలు చేయాల్సి ఉంటే వాటిని చేపట్టేందుకు వీలుగా కార్పొరేటర్లతో కూడా భేటీ నిర్వహించాలని సూచించారు. ఆయా డివిజన్లలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపేందుకు వీలుగా నెలరోజుల లోపే మేయర్ అనుమతితో నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్‌కు ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు వీలుగా ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పారదర్శకంగా పరిష్కరిస్తు అర్హత కలిగిన వారికి అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. సానిటేషన్ పనులు పక్కాగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు సిబ్బంది పనితీరును నిశితంగా పరిశీలించాలని కమిషనర్‌కు సూచించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా అమలు చేయాలన్నారు.

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**వేల్పూర మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో హామీలిచ్చి గడిచిన రెండు సంవత్సరాలుగా 6 గ్యారెంటీ అమలుపర్చకుండా తెలంగాణ 4 కోట్ల ప్రజలను మోసం చేసిందని బాల్కొండ నియోజకవర్గ టీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 6 గ్యారెంటీల అమలు కోసం నిధులు కూడా కేటాయించకుండా ఇంకా కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందని విమర్శించారు. ప్రజలను నమ్మించటానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆనాడు గ్యారెంటీ కార్డులను పంచి ప్రజలను మభ్యపెట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 25 నెలలు క ఆవస్తుంది కానీ ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదు. పథకాల తమకు తక్కువ.. ప్రచారం ఎక్కువ అన్న తీరున కాంగ్రెస్ పార్టీ పాలన సాగుతుంది. ఆరుగ్యారెంటీల్లో భాగంగా ప్రతి మహిళకు 2500 ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది కానీ ఇప్పటివరకు అమలు కాలేదు. 25 నెలలుగా 2500 చొప్పున 60 వేల కాంగ్రెస్ ప్రతి మహిళకు బాకీ పడింది. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. వృద్ధులకు, బీడీ పెన్షన్ వారికి అధికారంలోకి రాగానే 4000 పెన్షన్ చేస్తామన్నారు. కానీ కేసీఆర్ ఇచ్చిన 2 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఈ బడ్జెట్‌లో పెన్షన్ల పెంపు ఊసే లేదన్నారు. దివ్యాంగులకు పెంచుతామన్న 6 వేల పెన్షన్ అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రైతుభరోసా 15 వేల కౌలు, రైతులకు 15 వేలు, రుణమాఫీ కానీ వారికి 200000 రుణమాఫీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విద్యాభరోసా కార్డు 500000 ఇస్తామన్నారు నిధుల కేటాయింపు లేదు. ఉపాధిహామీ కూలీలకు, ఆటోడ్రైవర్లకు సంవత్సరంకు 12 వేల చొప్పున ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో చెప్పి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. విద్యార్థులకు 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలండర్, నిరుద్యోగ భృతి విద్యార్థులకు స్కూటీలు, ఫీ రిఎంబర్స్‌మెంట్లను విస్మరించింది. ఇప్పటివరకు పెళ్లిళ్లు అయినా ఆడబిడ్డలకు తులం బంగారం మాట బడ్జెట్‌లో ఎత్తలేదు. ఈ సమావేశంలో నాగంపేట్ శేఖర్‌రెడ్డి, బద్దం ప్రవీన్‌రెడ్డి, బాల్కొండ, కల్లెడలియా, ప్రెసిడెంట్ దాసరి వెంకటేష్, రేగుంట దేవేందర్, జైడి నాగధర్, బద్దం రవి, బద నర్సారెడ్డి, రేగుల్ల రాములు, దొంకంటి నర్సయ్య, చౌట్‌పల్లి రవి, ఆర్మూర్ మహేష్, రాజాపూర్ణానందం, కొలిపాక ఉపేందర్, శ్రీకాంత్, గడ్డం స్వామి, ఏలేటి రమేష్, ప్రతాప్, భోజపల్లి సురేష్, లోలపు సుమన్, బూరుకల కమలాకర్, డొల్ల రాజేశ్వర్ గంగారెడ్డి, నడ్కుడ నారాయణ, గంగాధర్, సూర్జిల్ శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ఆనంద్, యూసుఫ్, అశోక్ పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ



**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో పశుసంవర్ధక శాఖ, మోర్తాడ్ మండలం ఆధ్వర్యంలో శనివారం మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో గల 50పశువులకు (12గోవులకు+38 గేదెలకు) ఉచిత గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేయడం జరిగిందని మోర్తాడ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గాలికుంటు టీకాలను రైతులు తమ తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కర్ణాల మానస లక్ష్మణ్, పాడి రైతులు మండల నరేందర్, పత్రీ సాయిరాం సురేష్, ఆదేపు రాజేశ్వర్, మోమన్, అప్క గంగారాం, పశువైద్య సిబ్బంది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రాములోరి పట్టాభిషేకం



**ప్రజాపక్షం/ బోధన్:**బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లోని శ్రీ రామాలయంలో శ్రీ రాముల వారి పట్టాభిషేక మహోత్సవంను అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై వేద మంత్రోచ్చరణలతో శ్రీ సీతా రామలక్ష్మణ, హనుమాన్ ఉత్సవ మూర్తులకు అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామికి కిరీటం ధరింపచేసి పట్టాభిషేకం గావించారు. అనంతరం పట్టాభిషేక కార్యక్రమానికి విచ్చేసిన భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక సమావేశం

- సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తా చైర్మన్ లింబాద్రి



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన మున్సిపల్ కార్మికులతో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో కార్మికుల సమస్యలు,వారి సంక్షేమం, పనితీరును మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది.వైస్ చైర్మన్ ఓంకారి నవీన్,ఇతర కౌన్సిలర్లు పాల్గొని, కార్మికుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు.సమావేశం పట్టణ పరిశుభ్రతలో కీలకమైన కార్మికుల సేవలను గుర్తిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి మార్గదర్శకంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు,కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## పశువులకు గాలికుంటు టీకాలు



**ప్రజాపక్షం/మాక్లూర్:**మండలంలోని చిక్లీ గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులకు, గేదెలకు జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మండల వైద్యాధికారి డాక్టర్ ఉమామసహెర్ గ్రామసర్పంచ్ భూమన్న ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పాడీ పశువుల పెంపకం దారులనుద్దేశించి ఈ టీకాలు తప్పకుండా వినియోగించుకోవాలని లేనిచో పశువులు ఈ వ్యాధి బారిన పడి అధిక జ్వరంతో పశువులు మేత మేయకుండా నీరసంగా ఉండి తద్వారా పునరుత్పత్తి తగ్గి తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదముంటుంది. కావున సకాలంలో ఈ టీకాలు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ భూమన్న, ఉపసర్పంచ్ సతీష్, మండల పశు వైద్యసిబ్బంది వినీత, అహ్మద్‌పాషా, రవి, సికిందర్, గోపాలమిత్రలు సుధీర్, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

## ఉద్యోగాన్వేషణలో నిరుద్యోగులకు లీప్ సంవత్సరం సమాచారం అవసరం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**ఉద్యోగాన్వేషణలో నిరుద్యోగులకు లీప్ సంవత్సరం సమాచారం అవసరమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దాసరి విజయ ఆనందరావు అన్నారు. శనివారం స్థానిక బైపాస్ రోడ్డులోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ వారి అంధుల వనరుల కేంద్రంలో దాసరి విజయ ఆనందరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విద్యా సంస్థలలోని విద్యార్థులకు, ఉపాధ్యాలకు లీప్ సంవత్సరంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 78 సంవత్సరాల వయస్సులో అవగాహన అందించే లక్ష్యంతో 2024 మార్చిలో ప్రారంభించి 2025 డిసెంబర్ 16 వరకు 200 కు పైగా విద్యా సంస్థలలో అవగాహన కల్పించారు. లీప్ సంవత్సరంపై అవగాహనను కల్పించటం ఎంతో ముఖ్యమని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, సిబ్బంది అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా భవన్‌కు సీసీ రోడ్డు




**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :**ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన నిధులతో మండలంలోని మెండోరా గ్రామంలో పీఆర్ రోడ్డు నుంచి మహిళా సంఘం భవన్‌కు సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ మహిళా సంఘాల సభ్యులతో కలిసి భూమిపూజ చేసి సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలకు కృషి చేస్తామని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలియజేశారు. నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు, నాయకులు పల్లె శేఖర్, రాజేశ్వర్‌గౌడ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.